సాక్షి
బాపట్ల
సోమవారం । 19 । ఆగస్టు । 2024



వైభవంగా కల్యాణ మహోత్సవం

వినుకొండ(నూజెండ్ల): శ్రీనివాసనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు.



నిండిన పులిచింతల

అచ్చంపేట: పులిచింతల జలాశయం పూర్తిగా నిండింది. నీటినిల్వ 45.10 టీఎంసీలకు చేరింది. దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు.

మహాశక్తి అలంకారంలో బండ్లమ్మ



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోని బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారిని మహాశక్తి దేవిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

నగరాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని



నెహ్రూనగర్: నగరాభివృద్ధిపై పూర్తి దృష్టి సారించడంతోపాటు రోడ్ల ప్యాచ్ వర్క్‌లు, శానిటేషన్ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని, కార్పొరేషన్‌పై ఉన్న వ్యయభారం తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు సూచించారు. గుంటూరులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి పెమ్మసానిని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం కలిశారు. నగరంలోని పలు సమస్యలపై ఇరువురు చర్చించారు. రోడ్ల ప్యాచ్ వర్క్‌లు, పారిశుద్ధ్య సమస్యలతోపాటు రెవెన్యూ వసూళ్లకు ఎదురవుతున్న ఇబ్బందులను పెమ్మసానికి కమిషనర్ వివరించారు. కార్పొరేషన్‌పై పడుతున్న రెవెన్యూ భారాన్ని తగ్గించి, జీఎంసీకి రావాల్సిన ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలని కమిషనర్‌కు పెమ్మసాని సూచించారు. నగరాభివృద్ధితో పాటు ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్ వంటి పలు సుందరీకరణ కార్యక్రమాలను కూడా చేపట్టాలని రాబోయే 2 వారాల్లో పక్కా ప్రణాళికలను సిద్ధంగా చేయాలని సూచించారు. కార్పొరేషన్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించాలని పెమ్మసాని సూచించారు.

తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ బదిలీ




తెనాలి: తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ బదిలీ అయ్యారు. ఆయన్ను పాడేరు సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. పాడేరు ఐటీడీఏ పీవో బాధ్యతలనూ ఆయనకు అప్పగించినట్టు తెలిసింది. తెనాలి సబ్‌కలెక్టర్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు. 2021 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ప్రఖర్ జైన్ గతేడాది డిసెంబరులో తెనాలి సబ్‌కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆ నెల 21న బాధ్యతలు స్వీకరించారు. తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి 96వ అధికారిగా నియమితులైన ఆయన ఎనిమిది నెలలకే బదిలీ అయ్యారు.

25న రాష్ట్రస్థాయి శతాధిక కవిసమ్మేళనం

ఫిరంగిపురం: తెలుగు భాషాదినోత్సవం (గిడుగు వెంకట రామ్మూర్తి) జయంతిని పురస్కరించుకొని ఈనెల 25న రాష్ట్రస్థాయి శతాధిక కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు కొండవీడు రచయితల సంఘం అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్ రఫి, కార్యదర్శి టి.గోవిందయ్య సంయుక్తంగా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిరంగిపురంలోని వేణుగోపాలస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దీనిలో పాల్గొనే కవులు, రచయితలకు మధ్యాహ్న భోజన వసతి, శాలువా , జ్ఞాపిక, ప్రశంసాపత్రం ఇచ్చి గౌరవిస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు 9032380696, 9966385583 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సాగు నీటి సమాచారం



తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 7837 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 336 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1861, తూర్పు కెనాల్‌కు 765, పశ్చిమ కెనాల్‌కు 280, నిజాంపట్నం కాలువకు 450, కొమ్మమూరు కాలువకు 36150 క్యూసెక్కులు విడుదల చేశారు.

కొనసాగుతున్న నీటి విడుదల

విజయపురిసౌత్ : నాగార్జునసాగర్ వద్ద ఆదివారం రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ఎనిమిది అడుగుల మేర ఎత్తి 24,920 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 590.00 అడుగుల వద్ద ఉండగా ఇది 312.0450 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ నుంచి కుడికాలువకు 8,067, ఎడమ కాలువకు 6,791 క్యూసెక్కులు వదులతున్నారు.

పర్‌ఫెక్ట్ పిచ్

క్రికెట్ @ రావినూతల

- మారుమూల పల్లెలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియం
- 30 ఏళ్లుగా నిర్విరామంగా పోటీలు
- స్టేడియంలో క్రికెట్ ఆడిన పలువురు భారత జట్టు ఆటగాళ్లు

మేదరమెట్ల: ముప్పై ఏళ్ల కిందటే ఆ పల్లె క్రికెట్‌లో ఓనమాలు దిద్దింది. బుడిబుడి అడుగులతో నడకలు నేర్చింది. ఆ తర్వాత ఏకంగా పరుగులు పెట్టింది. క్రికెట్ కోసం గ్రామంలో ఏకంగా అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మాణమైంది. ఆ పల్లె పేరు రావినూతల. నేడు క్రికెట్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అప్పటి ప్రకాశం జిల్లాలో ఉండి నేడు బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని రావినూతల క్రికెట్ ఆట చరిత్ర ఎందరికో స్ఫూర్తిదాయకం. తొలుత ఆ పల్లెలో ఆడుతూ పాడుతూ తిరిగే కుర్రకారు సరదాగా క్రికెట్ పోటీలు నిర్వహిద్దాం అనుకొని వారిలో వారే రెండు జట్లుగా విడిపోయారు. సరదాగా ప్రారంభించిన పోటీలు ఇంతింతై వటుడింతై అన్నట్లుగా పెరిగాయి. అప్పటి నుంచి ప్రారంభించిన పోటీలు 30 ఏళ్లుగా నిర్విరామంగా కొనసాగుతున్నాయి. నేడు అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన క్రికెట్ పిచ్‌ని ఏర్పాటు చేసుకొని అదే స్థాయిలో అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీల్ని నిర్వహిస్తున్నారు.

అసోసియేషన్ సభ్యుల ఘనత

రావినూతలలో అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీల్ని నిర్వహించడంలో అసోసియేషన్ సభ్యుల కృషి ఎంతగానో ఉంది. గ్రామానికి చెందిన యువకులు రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆర్‌ఎస్‌సీఏ) ఏర్పాటు చేసుకొన్నారు. అప్పటి నుంచి ఏటా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కప్ పేరుతో క్రికెట్ పోటీల్ని నిర్వహిస్తున్నారు. తొలుత మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించిన పోటీలు అంతర్ రాష్ట్ర స్థాయికి చేరాయి. జిల్లాలోనే అంతర్ రాష్ట్ర పోటీల్ని నిర్వహించగల సామర్థ్యం ఉన్న ఏకైక గ్రౌండ్‌గా పేరు గాంచింది రావినూతల క్రికెట్ స్టేడియం.



గ్రౌండ్‌లో తయారు చేస్తున్న క్రికెట్ పిచ్

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు

రావినూతల క్రికెట్ స్టేడియంలోని పిచ్ అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయడం వల్ల ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇటీవల అండర్-19 ఉమ్మడి ప్రకాశం క్రికెట్ జట్టు ఎంపికలు సైతం ఈ స్టేడియంలోనే నిర్వహించారు.

సంక్రాంతి సమయంలో ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహణ

ఏటా ఆర్‌ఎస్‌సీఏ సంఘం సభ్యులు విరాళాలు సేకరించి పోటీల్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు సంక్రాంతి పండుగ సమయంలో గ్రామం కోలాహలంగా మారుతుంది. ప్రత్యేకంగా సంఘం అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు (బాబు) క్రికెట్‌పై ఉన్న మక్కువతో అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. 30 సంవత్సరాలుగా పోటీల్ని నిర్వహిస్తున్నారు.



క్రికెట్ స్టేడియం ఏరియల్ వ్యూ



ఆహ్లాదకర వాతావరణంలో క్రికెట్ గ్రౌండ్

స్టేడియంలో ఆడిన అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు

భారత మాజీ స్పిన్నర్ వెంకటపతిరాజు, వికెట్ కీపర్, ఇండియా క్రికెట్ మాజీ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్, భారత జట్టులో ఆడిన నోయల్ డేవిడ్, వేణుగోపాలరావు వంటి అంతర్జాతీయ క్రీడాకారులు సైతం ఈ గ్రౌండ్‌లో ఆడినవారే కావడం విశేషం.

సినీ తారలతో విజేతలకు బహుమతులు

గ్రామస్తులైన ప్రముఖ సినీ నటుడు యర్రా గిరిబాబు, ఆయన కుమారుడు రఘుబాబు పోటీల నిర్వహణకు ముందే గ్రామానికి వచ్చి ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నారు. ఏటా పోటీలు చివరి రోజు ప్రముఖ సినీ తారల్ని ఆహ్వానించి వారి చేతుల మీదుగా బహుమతుల్ని అందిస్తున్నారు.



అంతర్‌జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన టర్ఫ్ పిచ్

అంతర్జాతీయ ప్రమాణాలు

2004లో స్టేడియంలో అంతర్జాతీయ ప్రమాణాలతో టర్ఫ్ పిచ్‌ను ఏర్పాటు చేసి దాని పై అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీల్ని నిర్వహిస్తున్నారు. ఆ తరువాత పక్కనే మరో పిచ్‌ను అదే ప్రమాణాలతో ఏర్పాటు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా రెండు పిచ్‌లను ఉపయోగిస్తూ పోటీల్ని నిర్వహిస్తున్నారు.

దాతల సహకారం మరువలేనిది

- గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించడాన్ని గమనించిన అప్పటి అద్దంకి నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ బాచిన చెంచు గరటయ్య గ్రామస్తుల కోరిక మేరకు ఆరు ఎకరాల పోరంబోకు భూమిని క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ఇప్పించారు.
- గ్రామానికి చెందిన దాతలు ఇచ్చిన విరాళాలతో ప్రహరీని కూడా నిర్మించారు.
- పెవిలియన్ నిర్మాణం కోసం అప్పటి ఎంపీ దగ్గుబాటి రామానాయుడు తన నిధుల నుంచి రూ.10 లక్షలు ఇచ్చారు.
- ఎంపీ పనబాక లక్ష్మి, రాజ్యసభ సభ్యుడు జేడీ శీలం తమ నిధుల నుంచి రూ.9 లక్షలు మంజూరుతో స్టేడియంలో ఆడిటోరియం నిర్మించారు.
- 2008లో అప్పటి జిల్లా కలెక్టర్ కృష్ణబాబు టర్ఫ్ పిచ్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.2 లక్షలు ఇచ్చారు.
- పెవిలియన్ ఏర్పాటుతో పాటు దానిపై మరో అంతస్తును ఏర్పాటు చేయడానికి స్థానిక ఎంపీ శ్రీరాం మాల్యాద్రి తన సొంత నిధుల నుంచి రూ.15 లక్షలు ఇచ్చారు.
- ఏపీఎండీసీ ద్వారా రూ.10.లక్షలు మంజూరు చేశారు.
- మరికొందరు దాతలు సహాయ సహకారాల్ని అందించడంతో నేడు స్టేడియం పెవిలియన్ పూర్తి హంగులతో కనిపిస్తోంది.

రాష్ట్రంలోనే గుర్తింపు



గడచిన 30 సంవత్సరాలుగా నిరంతరంగా క్రికెట్ పోటీల్ని నిర్వహిస్తున్నాం. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ఆటగాళ్లు ఇక్కడకు వచ్చి ఆడటంతో గ్రామానికి మంచి గుర్తింపు వచ్చింది.

– యర్రా రఘుబాబు, ప్రముఖ సినీ నటుడు, రావినూతల

గ్రామస్తుల సహకారం మరువలేనిది



పోటీల నిర్వహణకు గ్రామస్తుల సహకారం మరువలేనిది. అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలతో పాటు క్రికెట్ పోటీల్ని కొనసాగిస్తున్నాం. రంజీ మ్యాచ్‌లను నిర్వహించేందుకు కూడా గ్రౌండ్ సిద్ధంగా ఉంది. అంతర్జాతీయ ప్రమాణాలతో పిచ్‌ను ఏర్పాటు చేశాం.

– కారుసాల నాగేశ్వరరావు (బాబు), రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఎస్సీ కమిషన్ చొరవతో దళిత కుటుంబానికి న్యాయం

బాధితుడి పక్షాన నిలిచిన కమిషన్ చైర్మన్

భట్టిప్రోలు: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చొరవతో భట్టిప్రోలు మండలం పెసర్లంకకు చెందిన దళిత కుటుంబానికి న్యాయం జరిగింది. గత జూన్ 18న కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ గ్రామానికి వచ్చి బాధితుడి పొలంలో అక్రమంగా నిర్మించిన రహదారిని పరిశీలించారు. అక్రమంగా వేసిన రహదారిని తొలగించి, ఇందుకు సంబంధించిన వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని, లేనిపక్షంలో కార్పొరేషన్ నుంచి సమన్లు జారీ చేస్తామని హెచ్చరించడంతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. దీంతో శనివారం రేపల్లె ఆర్డీవో హేలాషారోన్ పెసర్లంక వచ్చారు. బాధితుడు యన్నం సురేష్‌కు చెందిన పంట పొలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన రహదారిని పరిశీలించారు. ఆర్డీవో ఆదేశానుసారం ఆదివారం వీఆర్వోలు మంద్రు జక్రయ్య, అంబటి ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణలో పంట పొలంలో అక్రమంగా వేసిన రోడ్డును తొలగించారు. దీనికి బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేయాలని రేపల్లె డీఎస్పీ కార్యాలయానికి ఇప్పటికే రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు.



పంట పొలంలో అక్రమంగా నిర్మించిన రహదారి తొలగిస్తున్న సిబ్బంది

ఫుట్‌బాల్ పోటీల విజేత చీరాల క్లబ్ జట్టు



విజేతగా నిలిచిన చీరాల ఫుట్‌బాల్ క్లబ్ జట్టు



ద్వితీయ స్థానంలో నిలిచిన నరసరావుపేట జట్టు

- ద్వితీయ స్థానంలో నరసరావుపేట
- తృతీయ స్థానంలో గుంటూరు

చీరాల రూరల్: చీరాల ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో ప్రారంభించిన ఎనిమిది జిల్లాల స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. అన్ని జట్లు గెలుపుకోసం నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. చీరాల ఫుట్‌బాల్ క్లబ్ జట్టు విజేతగా నిలిచి, ప్రథమ బహుమతి రూ. 15,116 కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో పల్నాడు జిల్లా నరసరావుపేట జట్టు నిలిచి రూ. 7,116 సొంతం చేసుకుంది. తృతీయ స్థానంలో గుంటూరు జట్టు నిలిచి రూ. 5,116 అందుకుంది. ఆదివారం సెలవు దినం కావడంతో విద్యార్థులు, యువకులు ఫైనల్ పోటీల్ని చూసేందుకు అధికసంఖ్యలో వచ్చారు. పోటీల్ని గొట్టిపాటి భాగ్యరాజ్ పర్యవేక్షించారు.

జెడ్పీ స్థల పరిరక్షణకు చర్యలు

- రెండు ఎకరాల స్థలంలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం
- పీఆర్ గెస్ట్ హౌస్‌లో పీఐయూ కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు

సాక్షి ఎఫెక్ట్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని జిల్లా పరిషత్‌కు చెందిన విలువైన స్థలం ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షణ చర్యలను ఎట్టకేలకు ప్రారంభించారు. ఈ నెల 5న 'జెడ్పీ జాగా .. వేసేయ్ పాగా!' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా పరిషత్ పాలక వర్గం, అధికారులు స్పందించారు. జెడ్పీ స్థలం రెండు ఎకరాల్లో ఉన్న ముళ్లకంప, జంగిల్ క్లియరెన్స్ పనులు ఆదివారం పొక్లెయిన్‌తో చేపట్టారు. శిథిలావస్థలో ఉన్న పంచాయతీరాజ్ ప్రాజెక్టు ఇన్వెస్టిగేషన్ యూనిట్ (పీఐయూ)ను జెడ్పీ స్థలంలోని అసంపూర్తిగా ఉన్న పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌లోకి మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇకపై స్థలం ఆక్రమణలకు గురికాకుండా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అనుమతితో వాచ్‌మేన్ నియామకం కోసం కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. భూమిని దానమిచ్చిన కట్టమూరి అహోబిల భాస్కరరావు పేరుతో బోర్డు ఏర్పాటు చేయబోతున్నారు. అయితే జి ఇటీవల ఏర్పాటు చేసిన వెంకటేశ్వర జనరల్ స్టోర్ దుకాణంపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. జిల్లా పరిషత్ స్థలం పరిరక్షణకు జెడ్పీ పాలక వర్గం, అధికారులు చర్యలు తీసుకోవడంపై పలువురు అభినందిస్తున్నారు.

జ్ఞాపకాలు క్లిక్.. క్లిక్

- మదిలో మధుర జ్ఞాపకం ఫొటో
- చరిత్రకు సజీవ చిత్రం
- బ్లాక్ అండ్ వైట్ నుంచి కలర్ వరకు ప్రయాణం
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

జీవితంలో సంతోషం, బాధ, మధుర ఘట్టాలు, సాధించిన విజయాలు, అద్భుత సన్నివేశాలు, కాలానుగుణంలో ప్రకృతిలో చోటుచేసుకునే మార్పులను బంధించి పదిలంగా దాచుకుని మళ్లీ మళ్లీ చూసుకునే అవకాశం ఫొటోతోనే సాధ్యం.18వ శతాబ్దంలో ఫారిస్‌లో పుట్టి ప్రపంచ వ్యాప్తంగా రాజ్యమేలుతున్న ఫొటోగ్రఫీకి ఆధునిక కాలంలో మానవ జీవితంతో విడదీయలేని బంధం ఉంది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ సందర్భంగా ప్రత్యేక కథనం.

బాపట్ల టౌన్ / పిట్టలవానిపాలెం: జీవితంలోని మధురస్మృతులన్నీ దాచుకునే దృశ్య సంచిక ఫొటో.ఒకప్పుడు నల్లని పేపర్‌పై బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు అతికిస్తేనే ఆహా...ఓహో అనేవారు. ప్రస్తుత హైటెక్ యుగంలో రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. మనిషిగా పురుడు పోసుకున్న దశ నుంచి పెళ్లి వరకు అపురూప సంఘటనల్ని గుర్తుంచుకునేందుకు అల్బమ్‌ల వైపు ప్రజలు మక్కువ చూపుతున్నారు.

పలువురికి ఉపాధి

కేవలం ఫొటోగ్రఫీనే వృత్తిగా ఎంచుకునేవారు కొందరైతే తమ సృజనాత్మకతను చాటుకునేందుకు మక్కువ చూపేవారు మరికొందరున్నారు. బాపట్ల జిల్లాలోని 25 మండలాల్లో మూడు వేల మందికి పైగా ఫొటోగ్రాఫర్‌లు ఉన్నట్లుగా సమాచారం. గతంలో వీరికి ఫొటోలు తీసేపని మాత్రమే ఉండేది. ప్రస్తుతం అల్బమ్స్ రావడంతో వీరంతా ఆ పనిలో బిజీ అవుతున్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారు అనేక రకాల అల్బమ్స్ తయారుచేసి ఉపాధి పొందుతున్నారు. ఒక్కోదానికి రూ. 50 నుంచి రూ. 1.50 లక్షల వరకు తీసుకుంటున్నారు. నగరాల్లో అయితే ఒక్కో అల్బమ్‌కు రూ. 5 లక్షల సైతం వెచ్చించేందుకు ముందుకు వస్తున్నారు. వీటితోపాటు వీడియోగ్రాఫర్లకు మంచి డిమాండ్ పెరిగింది. ఫొటోలతో పాటు వీడియో తీసి వాటిని సినీ తరహాలో మిక్సింగ్ చేస్తున్నారు.







నాగరాజుకు తీసిన ఫొటోలు

పురుషులతో దీటుగా రాణిస్తున్న మహిళ



ఫొటోలు తీస్తున్న పులుగు హైమావతి

పురుషులకంటే తామేమి తక్కువకాదంటూ నిరూపిస్తుంది బాపట్ల పట్టణానికి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ హైమావతి. పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఆమె 15 ఏళ్లుగా వృత్తిలో ఉన్నారు. భర్త చిరుద్యోగి కావడంతో ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఆమె ఈ రంగాన్ని ఎంచుకున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో అర్ధరాత్రి కూడా వెనుకంజ వేయకుండా వేరే ప్రాంతాలకు వెళ్లి మరి సత్తాను చాటుకుంటున్నారు. 2012లో ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాపట్లలో నిర్వహించిన పోటీల్లో హైమావతి ద్వితీయ బహుమతి సాధించారు. ప్రస్తుతం ఆమె పట్టణంలోని ఏజీ కళాశాల రోడ్డులో ఎస్ఎస్ స్టూడియో నిర్వహిస్తున్నారు. ఆమె తీసే ప్రతి ఫొటోకు ఓ ప్రత్యేకత ఉంటుంది. మహిళలు చాలా వరకు ఆమె వద్ద దిగేందుకు ఇష్టపడుతుంటారు.

ఫొటోగ్రఫీలో డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నాగరాజు

బాపట్ల మండలం, ముత్తాయపాలెం గ్రామానికి చెందిన పీవీఎస్ నాగరాజు తీసే ప్రతి ఫొటోకు ఓ ప్రత్యేకత ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల ప్రజల స్థితిగతులు, సహజసిద్ధమైన ఆహ్లాదకర వాతావరణాలను చూపించే ఆయన ఛాయాచిత్రాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, మరెన్నో గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్, బ్రాంజ్ మెడల్స్ లభించాయి. సాధారణంగా ఫొటోగ్రాఫర్స్ నిత్యం ప్రోగ్రామ్స్ మాట్లాడుకునే పనిలో నిమగ్నం అవుతుంటే....నాగరాజు మాత్రం ప్రకృతి ప్రేమికుడిగా వన్యప్రాణుల దృశ్యాలు, శ్రామికుల జీవనశైలి, కష్టజీవుల బతుకు పోరాటం లాంటి చిత్రాలను కెమెరాలో బంధించే పనిలో నిమగ్నమవుతుంటారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఇటీవల నాగరాజుకు డాక్టరేట్ అందజేసింది.

ఇంద్రకీలాద్రిపై పవిత్రోత్సవాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం నుంచి పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. దేవాలయంలో జరిగే తెలిసీ తెలియని దోష పరిహారానికి, కాలచక్రంలో వచ్చే దోష నివారణకు ఏటా శ్రావణ మాసంలో పవిత్రోత్సవాలను ఇంద్రకీలాద్రిపై మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. ఉత్సవాలు మంగళవారం వరకు కొనసాగుతాయి. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, అలంకరణ, నిత్య పూజ అనంతరం ఉదయం 8.25 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్టాపన, సర్వప్రాయశ్చిత విధులు నిర్వహించారు. పూజల్లో ఆలయ ఈవో కె.ఎస్.రామరావు దంపతులు పాల్గొన్నారు. అనంతరం మల్లేశ్వరస్వామితో పాటు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శివకామసుందరీ సమేత నటరాజ స్వామి, గణపతి, శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి, క్షేత్రపాలకుడు వీరాంజనేయ స్వామితో పాటు ఇతర దేవతా మూర్తులకు అర్చకులు శాస్త్రోక్తంగా పవిత్ర మాలధారణ చేశారు.

క్లుప్తంగా

వలంటీర్లకు న్యాయం చేయండి

ఆంధ్రప్రదేశ్ వలంటీర్స్ అసోసియేషన్ డిమాండ్



లక్ష్మీపురం: వలంటీర్స్‌కి న్యాయం చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య, జిల్లా కన్వీనర్ రాజేష్ కోరారు. ఈ మేరకు కొత్తపేట మల్లయ్య భవనంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ రెండు నెలల గౌరవ వేతనాన్ని మంజూరు చేయించాలన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లవి బలవంతపు రాజీనామాలుగా గుర్తించి, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు రూ.10వేల జీతం తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్స్ ఒంగోలు ఉమా, షేక్ మునీరు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు



తెనాలి: గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2024 పోటీలు ఆదివారం తెనాలిలో ఘనంగా జరిగాయి. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సహకారంతో స్థానిక బస్ స్టేషన్ సమీపంలోని క్విక్ ఫిట్ నెస్ ఎరీనాలో జరిగిన ఈ పోటీల్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాటిబండ్ల రామకృష్ణ, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయభాస్కరరావు, కార్యదర్శి ఎస్కే సంధాని పాల్గొన్నారు. విజేతలకు సాయంత్రం బహుమతులు ప్రదానం చేశారు. క్విక్ ఫిట్ నెస్ ఎరీనా నిర్వాహకురాలు, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ ఘట్టమనేని సాయి రేవతి, కొమ్మినేని భార్గవ్ కుమార్, శివరామ కిరణ్‌రాజు పర్యవేక్షించారు.

21న జిల్లా స్థాయి అథ్లెటిక్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో అండర్–14, 16 బాలబాలికలు, అండర్– 18, 20 యువతీ యువకుల జిల్లాస్థాయి అథ్లెట్ల ఎంపిక పోటీలు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 21న నిర్వహించనున్నట్టు ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని సెప్టెంబరు 14 నుంచి 16వ తేదీ వరకు ఏఎన్‌యూలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. వివరాలకు 96666 35296 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

ఎస్‌బీ విభాగమే పోలీస్ శాఖకు కళ్లు, చెవులు

- సమీక్ష సమావేశంలో ఎస్పీ తుషార్ డూడీ
- గంజాయి, జూదాలు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలి
- ముందస్తు సమాచారంతో నేరాలు సమర్థంగా నియంత్రణ
- ప్రజలతో మమేకమై వేగంగా సమాచారం సేకరించాలి



సమావేశానికి హాజరైన ఎస్‌బీ సిబ్బంది



మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల టౌన్: ఎస్‌బీ విభాగమే పోలీస్ శాఖకు కళ్లు, చెవులు అని ఎస్పీ తుషార్ డూడీ పేర్కొన్నారు. జిల్లా క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎస్‌బీ పోలీసులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తొలుత బాధ్యతలు, విధుల నిర్వహణపై ఆయన పలు సూచనలు చేశారు. పోలీస్ శాఖలో ఎస్‌బీ విభాగం అత్యంత కీలకమైందన్నారు. ముందస్తు సమాచారం అందించడం వల్ల ఎన్నో నేరాల్ని అదుపు చేయవచ్చన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై జిల్లాలో జరుగుతున్న సమాచారాన్ని ముందస్తుగా సేకరించాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉంటే త్వరితగతిన ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల అమ్మకం, వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచాలని చెప్పారు. పేకాట, కోడిపందేలు, ఇతర అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారాన్ని ముందస్తుగా ఉన్నతాధికారులకు అందించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబద్ధత, అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించినా, రహస్య సమాచారం సేకరణలో అలసత్వం వహించినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సంఘటలను వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా 100, 112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. సమావేశంలో ఎస్‌బీ ఇన్‌చార్జి సీఐ బాలమురళీకృష్ణ, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజ స్థాపనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసూనరాణి

బాపట్ల: పొగాకు రహిత సమాజ స్థాపనే విద్యార్థుల లక్ష్యం కావాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రసూనరాణి తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఆదివారం టొబాకో ఫ్రీ యూత్ 2.0 కార్యక్రమం నిర్వహించారు. ప్రసూనరాణి మాట్లాడుతూ విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, ఈ వయసులో విద్యార్థులు వివేకంతో మెలగాలని సూచించారు. వ్యసనాలకు బానిసలు కాకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. టొబాకో సంబంధిత పదార్థాలను వాడరాదని, సరదాగా ప్రారంభమైన వ్యసనం ప్రాణాంతకం అవుతుందని తెలిపారు. దుర్వ్యసనాలకు దూరంగా ఉన్న విద్యార్థులను సమాజం హర్షిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఆదర్శ జీవనం గడపాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కాట్రగడ్డ శ్రీనివాసరావు, ఎం. శ్రీనివాసరావు, కె. విజయ ప్రకాష్, ఎం. సంధ్య, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవే 'లయన్స్' లక్ష్యం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



కుట్టుమిషన్లు అందజేసిన మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు

నగరంపాలెం: మానవ సేవే ధ్యేయంగా లయన్స్ సేవలు అందించడం అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ (జిల్లా 316–హెచ్) ఏడో ప్రమాణ స్వీకారోత్సవం, సేవ కార్యక్రమాలను ఆదివారం మార్కెట్ కూడలిలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వార ప్రపంచ వ్యాప్తంగా వందలాది దేశాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. నిరుపేదలకు విద్య, వైద్యం, మౌలిక సౌకర్యాల కల్పించేందుకు పెద్ద పీట వేస్తున్నారని ప్రశంసించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ మంచి ఆలోచన, మానవత్వంతో సమాజానికి అవసరమైన లయన్స్ చేపట్టే కార్యక్రమాల్లో నడిచేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. పేద వర్గాలకు మరింత సేవలు అందాలని ఆకాంక్షించారు. నూతన గవర్నర్ పరుచూరి గోపీచంద్ మాట్లాడుతూ గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 47 క్లబ్‌ల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. తద్వారా మొదటి స్థానంలో ఉండేందుకు కృషిచేస్తామని చెప్పారు. అనంతరం 200 మంది మహిళలకు కుట్టు మిషన్లు, గ్రైండర్లు, యాభై ఇస్త్రీ పెట్టెలు, యాభై తోపుడు బండ్ల వంటి పనిముట్లను మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్లు చిగురుపాటి వరప్రసాద్, నూతలపాటి వీరప్రకాష్, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ కార్యదర్శి వి.వెంకటసుబ్బయ్య, కోశాధికారి డాక్టర్ ఎస్.చక్రపాణి, ఉగ్గిరాల సీతారామయ్య, కేవీ నగేష్, డాక్టర్ పి.నాగహరిత, బెంజిమెన్, కార్పొరేటర్ పోతురాజు సమత, రజని, ప్రసన్న, ఉషా తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

బాపట్ల టౌన్: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టణ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. బాపట్ల పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన బెజ్జం సువర్ణరాజు, పల్నాడు జిల్లా, నూజెండ్ల మండలానికి చెందిన వల్లపు చాణక్య వైజాక్‌లో కలిసి చదువుతున్నారు. వీరికి కాకినాడకు చెందిన సంతోష్ అనే స్నేహితుడు ఉన్నాడు. వీరంతా చెడు వ్యసనాలకు బానిసై అక్రమ మార్గాల్లో డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో కాకినాడలోని స్నేహితుడు సంతోష్ వద్ద 400 గ్రాముల గంజాయిని కొని చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారుచేసుకొని రైలు ద్వారా బెజ్జం సువర్ణరాజు, వల్లపు చాణక్య బాపట్ల చేరుకున్నారు. ఉప్పరపాలెం గేటు సమీపంలో రైలు దిగి మోపెడ్‌పై ప్రయాణిస్తుండగా ముందస్తు సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు దాడి చేశారు. బెజ్జం సువర్ణరాజు, వల్లపు చాణక్యలను అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ ఆర్. అహ్మద్‌జాని తెలిపారు.

కాలు జారి బావిలో పడి రైతు మృతి



వెంకటరెడ్డి మృతదేహం

సంతమాగులూరు (అద్దంకి): ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని ఏల్చూరులో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన చల్లా వెంకటరెడ్డి (37) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం పొలానికి నీరు పెట్టేందుకు పైపులు అమరుస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందాడు. పక్క పొలంలో పని చేసే మరో రైతు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

వాహనం ఢీకొని యాచకురాలి మృతి



చినగంజాం: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకురాలు మృతి చెందింది. ఎస్ఐ రమేష్ వివరాల మేరకు.. చినగంజాం నుంచి చీరాల వెళ్లే జాతీయ రహదారిపై ఎంత్రీ హోటల్‌కు సమీపంలో వృద్ధ యాచకురాలు శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. మోటుపల్లి పరిధిలోని ప్రాంతం కావడంతో వీఆర్వో దానియేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసికొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఆమె వివరాలు తెలియక పోవడంతో యాచకురాలిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు పంపినట్లు తెలిపారు.

దశ దినకర్మకు వచ్చిన స్వీపర్ మృతి

చేబ్రోలు: దశ దినకర్మకు వచ్చి ప్రమాదవశాత్తూ అప్పాపురం చానల్‌లో జారిపడి పంచాయతీ స్వీపర్ మరణించిన ఘటన మండలంలోని వడ్లమూడి గ్రామ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం గ్రామంలో పాలపర్తి రామయ్య కర్మక్రతువుల కార్యక్రమానికి పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామానికి చెందిన పాలపర్తి కృష్ణ (54) వచ్చాడు. బంధువులతో కలిసి అప్పాపురం చానల్‌కు వచ్చాడు. ఉధృతంగా ఉన్న నీటి ప్రవాహంలో స్నానం చేసి, తిరుగు ప్రయాణమయ్యారు. కాలువ కట్టమీద నడుచుకుంటూ వస్తున్న కృష్ణ ప్రమాదవశాత్తూ కాలు జారి చానల్‌లో పడిపోయాడు. బంధువులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సమీపంలో కాలువలోని తూడికాడలో ఇరుక్కుపోయి కృష్ణ మృతదేహం కనిపించింది. దీంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు నాగులపాడు పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తున్నట్లు బంధువులు తెలిపారు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ముప్పాళ్ళ: ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొట్టిన ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద ఆదివారం జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని మాదలకు చెందిన డి.మురళీకృష్ణ, వంశీ, మరో యువకుడు ముప్పాళ్ళ నుంచి మాదలకు బైకుపై వెళుతున్నారు. బొల్లవరం అడ్డరోడ్డు వద్ద సత్తెనపల్లి వైపు నుంచి నరసరావుపేట వెళుతున్న ఆటో ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): భార్యతో గొడవపడి భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన భవానీపురం హెచ్‌బీకాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామచంద్రపురానికి చెందిన గుమ్మడివల్లి శ్రీకాంత్ పటమటలోని హృదయాలయ ఆస్పత్రిలో మత్తు డాక్టర్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం ప్రకాశం జిల్లాకు చెందిన త్రివేణితో వివాహమైంది. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. కొద్దికాలం క్రితం నుంచి భవానీపురం హెచ్‌బీ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో శ్రీకాంత్ వేరే మహిళతో ఫోన్‌లో మాట్లాడటం గమనించిన త్రివేణి భర్తను నిలదీసింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్యా గొడవ జరిగింది. భార్యపై శ్రీకాంత్ చేయిచేసుకున్నాడు. జరిగిన విషయాన్ని అత్తమామలకు ఫోన్ ద్వారా త్రివేణి తెలిపింది. తాము వస్తామని, గొడవ పడొద్దని వారు సర్ది చెప్పారు. ఈలోగా త్రివేణి తన భర్తతో ఫోన్‌లో మాట్లాడిన మహిళకు ఫోన్ చేసి ఇంటికి రమ్మని పిలిచింది. ఆ మహిళ ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో భవానీపురంలో శ్రీకాంత్ అద్దెకు ఉంటున్న ఇంటికి వచ్చి.. శ్రీకాంత్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో మరోసారి దంపతులు గొడవపడ్డారు. శ్రీకాంత్ కొట్టడంతో ఆమె పక్కింటికి వెళ్లిపోయింది. అతను ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో కుమారుడికి ఏమైనా తినిపిద్దామని త్రివేణి ఇంటికి వెళ్లి చూడగా తలుపులు వేసి ఉన్నాయి. తలుపులు గట్టిగా నెట్టడంతో గడియ ఊడిపోయింది. ఆమె బెడ్ రూంలోకి వెళ్లి చూడగా శ్రీకాంత్ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. జరిగిన విషయాన్ని త్రివేణి బావ వెంకటేష్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. ఈలోగా అత్తమామలు వచ్చేసరికి శ్రీకాంత్ చనిపోయి ఉన్నాడు. దీనిపై శ్రీకాంత్ తండ్రి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. తమ కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని లక్ష్మీనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలకలూరుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన జరిగింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని శాంతీనగర్‌కు చెందిన సయ్యద్ సుభానీ (54) అడ్డ రోడ్డులోని టైర్ల షాపు నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై అడ్డ రోడ్డు సెంటర్‌లోని జాతీయ రహదారి దాటుతున్నాడు. అప్పుడే ఒంగోలు నుంచి గుంటూరు వెళ్తున్న మినీ ట్రక్కు ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుభానీని స్థానికులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. సుభానీకి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రం.. భళారే విచిత్రం

- లేని ట్రాక్టర్లకు భట్టిప్రోలు పంచాయతీకి నోటీసులు
- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం
- సంబంధం లేని వ్యక్తులకు ట్రాక్టర్లు మంజూరు



రాజేష్ పేరుతో వచ్చిన నోటీసు



బాబూరావు పేరుతో వచ్చిన నోటీసు

భట్టిప్రోలు: లేని ట్రాక్టర్లకు నగదు కట్టాలంటూ ఎస్సీ కార్పొరేషన్ నుంచి భట్టిప్రోలు గ్రామ పంచాయతీకి నోటీసులు అందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్ (గుంటూరు) నుంచి ఈ ఏడాది జనవరిలో ఈ నోటీసులు వచ్చాయి. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భట్టిప్రోలులో పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులకు టాక్టర్, ట్రాలీ మంజూరుకు సంబంధించి రికవరీ నగదు చెల్లించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భట్టిప్రోలుకు చెందిన పప్పుల రాజేష్, గుమ్మడి బాబూరావుకు 2018 ఏప్రిల్ 16న రూ. 4,25,409 వ్యయం చేసే రెండు ట్రాక్టర్లు మంజూరయ్యాయి. దీనికి సంబంధించి నెల వారీ కిస్తీ రూ.7,090 చొప్పున చెల్లించాలని నోటీసులు వచ్చాయి. నేటి వరకు కనీసం ఒక నెల కూడా చెల్లించకపోవడం గమనార్హం. మేజర్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చేయడానికి గానూ అప్పటి పంచాయతీ కార్యదర్శి సంబంధిత తీర్మానాల్లో తెలిపిన పప్పుల రాజేష్, గుమ్మడి బాబూరావుకు ట్రాక్టర్, ట్రాలీ రిజిస్ట్రేషన్ చేసి వారి ద్వారా పంచాయతీకి అందజేశారు.

ట్రాక్టర్ల అప్పగింతకు పంచాయతీ కూడా తీర్మానం

రిజిస్ట్రేషన్ చేసిన ట్రాక్టర్లు నేటి వరకు పంచాయతీలో ఉన్న దాఖలాలు లేదు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం స్వచ్ఛ భారత్ కింద తీసుకున్న ట్రాక్టర్లను కొందరు స్వార్థపరులు తమ అనుయాయులకు కట్టబెట్టేందుకు ఎటువంటి మోసానికైనా దిగుతారనడానికి ఈ సంఘటనే నిదర్శనం. ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీపై ట్రాక్టర్లను ఆ సామాజికవర్గ అభ్యర్థులకు మాత్రమే ఇవ్వడం సాధ్యం. పంచాయతీకి ఇవ్వడానికి వీలు లేదు. ఈ నేపథ్యంలో అప్పటి పంచాయతీ కార్యదర్శి తీర్మానం చేయడం వెనుక ఎవరి హస్తం ఉందనే విషయం నిగ్గు తేలాల్సి ఉంది. పంచాయతీ నగదుతో వ్యక్తుల పేర్లతో ఎందుకు రిజిస్ట్రేషన్ చేశారో అంతుచిక్కకుండా ఉంది. పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేసే వ్యక్తులకు ఈ ట్రాక్టర్లు మంజూరు చేయాల్సి ఉండగా, సంబంధం లేని వ్యక్తులకు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటో పైవాడికే ఎరుక.

ఈ విషయమై భట్టిప్రోలు పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావును వివరణ కోరగా నాలుగైదు నెలల కిందట ఎస్సీ కార్పొరేషన్ నుంచి నోటీసులు వచ్చిన మాట వాస్తవమేనని తెలిపారు. ఈ విషయాన్ని సర్పంచ్ దారా రవి కిరణ్మయి దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. తాను బాధ్యతలు చేపట్టి సంవత్సరం దాటిందని, అప్పటి విషయాలు తనకు తెలియదని పేర్కొన్నారు.

పేదల కోసం మోహనరంగా పోరాటం



రంగా విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులు అర్పిస్తున్న రాధ, వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు : పేదల సమస్యల కోసం నిరంతరం తన తండ్రి వంగవీటి మోహనరంగా పోరాడారని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని ఆవులవారిపాలెంలో ఆదివారం రాత్రి రంగా విగ్రహ ఆవిష్కరణలో ఆయన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో కలసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ తన తండ్రి రంగా ఏ ఒక్క కులానికి, రాజకీయాలకు సంబంధించిన వ్యక్తి కాదని తెలిపారు. ఆయన ఎమ్మెల్యేగా తక్కువ కాలం పనిచేసినప్పటికీ పేద ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ రంగా మరణించి దశాబ్దాలు గడుస్తున్నా నేటికి ఆయన ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకొని జీవిస్తున్నారని కొనియాడారు. తొలుత రంగా అభిమానులు కొల్లూరు అయ్యప్పస్వామి ఆలయం నుంచి ఆవులవారిపాలెం వరకు ద్విచక్ర వాహన ర్యాలీతో రాధాకృష్ణను తీసుకొచ్చారు. కార్యక్రమంలో విగ్రహదాత అరవ రామకృష్ణ, ప్రియదర్శిని కళాశాలల డైరెక్టర్ చందు రామారావు, మోపిదేవి శ్రీను, కొల్లూరు మాజీ ఎంపీపీ కనగాల మధుసూదనప్రసాద్, గాజుల్లంక సొసైటీ మాజీ చైర్పర్సన్ తూము నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులు హస్తగతం చేసుకునేందుకు కేంద్రం యత్నం

ఆవాజ్ ఆధ్వర్యంలో వక్ఫ్ చట్ట సవరణపై సదస్సు



మాట్లాడుతున్న న్యాయనిపుణులు జహారా, న్యాయవాదులు సురేష్, శ్రీనివాసరావు తదితరులు

లక్ష్మీపురం: దేశంలో మూడవ అతి పెద్ద సంస్థగా ఉన్న వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం హస్తగతం చేసుకోవాలని చూస్తోందని న్యాయనిపుణులు జహారా అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేస్తూ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. న్యాయనిపుణులు జహారా మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులో ఇతర మతస్తులను నియమించడం చాలా దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు న్యాయవాది సురేష్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వ పరం చేస్తూ జిల్లా కలెక్టరుకు విచక్షణాధికారాలు ఇవ్వడం సరికాదన్నారు. హైకోర్టు న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధమైన ఈ చర్యలను తక్షణమే నిలిపి వేయాలన్నారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిస్తీ మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణను వెనుకకు తీసుకోకపోతే రాష్ట్రంలోని లౌకిక శక్తులన్నింటినీ కలుపుకుని ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ముస్లిం అడ్వకేట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మతిన్ మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమాన్ని బీజేపీ ప్రభుత్వం నీరుగార్చాలని చూస్తోందన్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ దీన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో జిల్లా అధ్యక్షులు షేక్. బాషా, సీనియర్ నాయకులు ఎండీ అక్బర్, మెడికల్ రేట్స్ నాయకులు ఎండీ సలీం, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఖాజావలి, మిల్లి కౌన్సిల్ జిల్లా నాయకులు ముఫ్తి ఆసిఫ్ పాల్గొన్నారు.

పరుగుల వర్షం..వికెట్ల జోరు

హోరా హోరీగా అనంతపురం, తూర్పుగోదావరి మ్యాచ్



బ్యాటర్ బి.ప్రశాంత్



బౌలర్ ఎస్.సాహిల్



బౌలర్ ఎస్.అనిల్ కుమార్

మంగళగిరి: అమరావతి టౌన్‌షిప్‌లోని ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో అండర్ – 19 మెన్ మల్టీ డే ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. తూర్పు గోదావరి, అనంతపురం జట్లు పరుగులు వర్షం కురిపించాయి. రెండవ రోజు ఆదివారం బ్యాటింగ్ చేసిన తూర్పు గోదావరి జట్టు 51.1 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటయ్యింది. అనంతపురం బౌలర్ ఎస్.సాహిల్ 7 వికెట్లతో రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 72.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 336 పరుగులు చేసింది. బ్యాటర్ బి.ప్రశాంత్(124) సెంచరీతో విజృంభించగా, 67 పరుగులతో వెంకట్ లోకేష్ సత్తాచాటాడు. తూర్పు గోదావరి బౌలర్ ఎస్.అనిల్ కుమార్ 6 వికెట్లతో రాణించాడు. అంతకు ముందు అనంతపురం మొదటి ఇన్నింగ్స్‌లో 205 పరుగులకు పరిమితమైంది. రెండవ రోజు ఆట ముగిసే సమయానికి అనంతపురం 360 పరుగుల ఆధిక్యంలో ఉంది.

వినుకొండ పోలీసుల వింత వైఖరి

- కూలీలను వేధించిన వ్యాపారిని విడిచిపెట్టిన అధికారులు
- టీడీపీ అండదండలు ఉండటంతో కేసు నమోదుకు నిరాకరణ
- ఎస్పీకి మొర పెట్టుకున్నా ఫలితం లేదని బాధితుల ఆవేదన

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ నియోజకవర్గంలో కూలీలను కలప వ్యాపారి అక్రమంగా నిర్బంధించిన విషయంలో పోలీసుల తీరు తీవ్ర విమర్శలు తావిస్తోంది. కేసు నమోదు చేయకుండా తూతూమంత్రంగా విచారణ చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. వినుకొండ ప్రాంతానికి చెందిన కలప వ్యాపారి మస్తాన్ వలి సుబాబుల్, జామాయిల్ కర్ర కొట్టేందుకు మూడేళ్ల క్రితం ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం నుంచి 25 మందిని పనిలో కుదుర్చుకున్నాడు. అవసరాలకు కొంత డబ్బు ఇచ్చి తనకు రూ.8 లక్షలు బాకీ ఉన్నారంటూ తప్పుడు లెక్కలు చూపాడు. వారికి కనీసం జీతం కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టాడు. కూలీల పిల్లలు అనారోగ్యానికి గురైనా పట్టించుకోలేదు. ఇటీవల ఓ చిన్నారి ఇలా మృతి చెందినా పనులు కొనసాగించాలని ఒత్తిడి చేశాడు. దిక్కుతోచని కూలీలు గత సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు మస్తాన్ వలిని విచారించి, వదిలేశారు.

టీడీపీ నాయకుల అండ

మస్తాన్ వలికి టీడీపీకి చెందిన నాయకుల అండదండలు ఉండటంతోనే కేసు లేకుండా వదిలి పెట్టారని బాధితులు ఆరోపిస్తున్నారు. మస్తాన్ వలి వద్ద ఇకపై పనిచేయాల్సిన అవసరం లేదని, స్వస్థలాలకు వెళ్లవచ్చని చెప్పి కూలీలను పోలీసులు పంపించారు. పెద్ద ఘనకార్యం సాధించినట్లు, కూలీలను వెట్టి నుంచి విముక్తులను చేసినట్లు చూపించి మస్తాన్ వలిని వదిలివేయడంతో పోలీసుల తీరును పలువురు తప్పుబడుతున్నారు. కూలీలు తనకు రూ.8 లక్షలు ఇవ్వాలని పోలీసులకు మస్తాన్ వలి తొలుత చెప్పినప్పటికీ విచారణలో మాత్రం దానికి ఎలాంటి ఆధారాలూ చూపలేకపోయాడు. అయినప్పటికీ వదిలి పెట్టడంతో పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు నిష్పక్షపాతంగా విచారించి, నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాధితులు కోరుతున్నారు.